సంపుటి : 9
సంచిక : 344
శనివారం
05 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE





Contact For Ads:
7579339999


# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

**పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తున్న ఆంధ్ర పేపర్ మిల్లు - పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**కోర్టు కేసులను వేగవంతం చేయాలని న్యాయవాదులకు ఆదేశాలు - స్వచ్ఛ గోదావరి లక్ష్యంగా ముందుకెళతామన్న ప్రభుత్వం**

**రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు.

**పుష్కర కాలంగా పన్ను ఎగవేత**

2016 నుంచి కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమండ్రి నగరపాలక సంస్థకు గానీ ఆంధ్ర పేపర్ మిల్లు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు సుమారు రూ. 21.34 కోట్ల మేర పన్నులు బకాయిపడిందని ఆయన తెలిపారు. పన్ను చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ, యాజమాన్యం కోర్టులను ఆశ్రయించి జాప్యం చేస్తోందని, బాధ్యత నుంచి తప్పించుకుంటోందని మండిపడ్డారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా సొంతంగా పన్ను మినహాయింపు ఇచ్చుకున్నారా? అని ఆయన నిలదీశారు.

**గోదావరిని కమ్మేస్తున్న కాలుష్యం**

అధికారిక గణాంకాల ప్రకారమే రాజమండ్రి నగరంలోని మొత్తం కాలుష్యంలో సగం ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే వస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నగరం మొత్తం మీద రోజుకు 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అయితే, ఒక్క ఆంధ్ర పేపర్ మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు వెలువడుతున్నాయని వివరించారు. ఈ వ్యర్థ జలాల్లో ప్రమాదకర రసాయనాలు నిర్దేశిత పరిమితికి మించి ఉన్నాయని పరీక్షల్లో తేలిందన్నారు. లాగూన్ల వద్ద సేకరించిన నీటి నమూనాల్లో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) లీటరుకు 36 మిల్లీగ్రాములుగా ఉందని, ఇది ప్రమాణాల కన్నా 20 శాతం అధికమని తెలిపారు.



అదేవిధంగా ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్‌లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

**పర్యావరణం, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం**

పరిశ్రమ విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గోదావరి నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని, నది సహజ పర్యావరణ

తరువాయి.. 2లో..

# స్థానిక ఎన్నికలే లక్ష్యం..

**ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ**

**క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం**

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం**



**అమరావతి, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు-కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో

తరువాయి.. 2లో..

**కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను**

# పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి రావాలని ఆదేశం
- భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం

**కొడంగల్, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.



**వైకాపా నేత జక్కంపూడి రాజాపై**

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



**నల్లజర్ల, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వైకాపా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై నల్లజర్ల పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నెల 2న దూబచర్లలో జరిగిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కించపరిచేలా జక్కంపూడి రాజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై దూబచర్లకు చెందిన తెదేపా నాయకుడు బోడిగడ్ల నాగరఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జక్కంపూడి రాజాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయబాబు తెలిపారు.

# ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

- తన పేరుతో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ
- క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన
- కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం
- అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ
- కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి



**తెలంగాణా, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నట రాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల

తరువాయి.. 2లో..

**అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం**

# తప్పుడు ప్రచారం

**ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్**

**ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ**

**కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం**

**ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ**

**విద్యాశాఖపై దృష్టి పెట్టాలని లోకేష్‌కు సూచించిన జగన్**




**తాడేపల్లి, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి

తరువాయి.. 2లో..

# ఆ సన్నని గొంతే ఆశలు నింపి.. నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం

**సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** నేపాల్ విలయంలో గల్లంతైన తమవారు బతికి వస్తారనే ఆశలు సన్నగిల్లుతోన్న వేళ ఓ అద్భుతం జరిగింది. 9 రోజులుగా ఎదురుచూసి.. కొందరి కర్మకాండలు కూడా చేస్తున్న సమయంలో టన్నెల్ నుంచి ఇద్దరు సజీవంగా బయటపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. భోటెకోషి నది ఉప్పొంగడంతో 60 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దెబ్బతినగా.. పలువురు సిబ్బంది త్రిశూలి 3ఏ టన్నెల్‌లో చిక్కుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి సంఖ్య 42గా తెలుస్తోంది. తాజాగా సహాయ సిబ్బంది ఇద్దరిని రక్షించడంతో మిగిలిన వారూ ప్రాణాలతో బయటపడతారనే ఆశలు చిగురించాయి. మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌ను సొరంగంలో 170 మీటర్ల లోతు నుంచి కాపాడినట్లు నేపాల్ ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజారామ్ బాస్నెట్ వెల్లడించారు. సహాయక చర్యలను పర్యవేక్షించే అధికారులు, నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మామూలుగా సొరంగం

తరువాయి.. 2లో..



**కొండా సురేఖను**

# బీఆర్ఎస్‌లోకి తీసుకోం

**మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని.. వారిలో ఒకరిద్దరు మినహా ఎవరినీ తీసుకోబోమని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశంపైనా జగదీశ్‌రెడ్డి స్పందించారు. "పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకునేది లేదని చాలా మంది నేతలకు ఇప్పటికే చెప్పాం. కొండా సురేఖను కూడా పార్టీలోకి తీసుకోం. బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దరఖాస్తు చేసినా ఆయన్ను తీసుకునేది లేదు. ఎన్నికలకు

తరువాయి.. 2లో..

# ఈ పని చేస్తే రేషన్ కార్డు కట్

**ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిక**

**అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వని సర్పంచుల పదవులు ప్రమాదంలో పడతాయని స్పష్టీకరణ**

**పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ**

**కరువు సూచనల నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం**



**ఖమ్మం, సెప్టెంబర్ 04, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను

తరువాయి.. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

వ్యవస్థ దెబ్బతింటోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. దుర్వాసన, నీటి నాణ్యత క్షీణతతో ప్రజారోగ్యానికి హాని కలుగుతోందని, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. గతంలో తాను క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు భూగర్భ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించినా, యాజమాన్యం పట్టించుకోలేదని గుర్తుచేశారు.

**ఇక ఉపేక్షించేది లేదు..**

నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి – పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణవేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## ఆ పోస్టులతో మాకు సంబంధం లేదు

తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకుతనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది. కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

## తప్పుడు ప్రచారం

ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటం కించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం..

కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుని, ఐక్యంగా పనిచేయడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం

వంటి భూగర్భ ప్రాంతాల్లో కార్మికులు, పర్యాటకులకు సురక్షితమైన ఆక్సిజన్‌తో కూడిన ఎయిర్ ప్యాకెట్స్, ట్రాప్డ్ వాటర్ ఉంటాయి. టన్నెల్ లోపల హానికర వాయువుల కారణంగా ప్రాణాలు కోల్పోకుండా బయటనుంచి పైపులు ద్వారా ఆక్సిజన్ పంపుతుంటారు. మరోవైపు, టన్నెల్ లో చిక్కుకుపోయిన సందర్భంలో తమను తాము రక్షించుకోవడానికి ఎత్తుగా ఉన్నవైపు వస్తుంటారు. కానీ, నేపాల్ జల ప్రళయంలో రాళ్లు, వరద, బురద పెద్ద ఎత్తున కొట్టుకురావడంతో అవి వారిని కిందికి నెట్టేసి ఉండొచ్చు కూడా. చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా..? లేరా..? అనే ఊగిసలాట మధ్య సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బండరాళ్లు, శిథిలాలు తొలగిస్తుండగా.. సమీపానికి వెళ్లేకొద్దీ వారికి లోపల ఉన్నవారి గొంతు సన్నగా వినిపించింది. లోపల దొరికిన నీరు, ఆహారంతో ప్రాణాలు నిలబెట్టుకున్న ఇద్దరు వ్యక్తులు సహాయక సిబ్బందికి కనిపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వారు సొరంగంలోకి దిగి, ఆ ఇద్దరినీ బయటకు తీసుకొచ్చిన దృశ్యాలను నేపాల్ ఆర్మీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. "ఆశ అందించిన అద్భుత విజయం ఇది" అని పేర్కొంది. "ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్నింటినీ తిరగరాస్తోంది. ఎందుకంటే ఇంతకముందెప్పుడు ఈ స్థాయిలో విద్యుత్ కేంద్రాలు ధ్వంసమై, పలు సొరంగాల్లో సహాయక చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. కార్ల పరిమాణంలో ఉన్న రాళ్లను పగలగొట్టాం. ఇద్దరిని కాపాడటంతో లోపల ఉన్నవారు బతికే ఉండొచ్చనే అనుమానానికి ఇప్పుడు మాకు ఆధారం లభించింది. మేం పడిన శ్రమకు ఫలితం కనిపిస్తోంది" అని ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న టన్నెల్ రెస్క్యూ ఎక్స్‌పర్ట్ ఆర్నాల్డ్ డిక్స్ జాతీయ మీడియాతో అన్నారు. 2023లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన ఈ నిపుణుడు.. భారత్‌కు సుపరిచితులు. ప్రస్తుతం టన్నెళ్ల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇది పునర్జన్మ.. ఇది తనకు పునర్జన్మ అని మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్ అన్నారు. ప్రాణాపాయ స్థితిలో హరే కృష్ణ మహామంత్రాన్ని జపిస్తూనే ఉన్నానని చెప్పారు.

**కొండా సురేఖను**

## బీఆర్ఎస్‌లోకి తీసుకోం


ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి వస్తామంటే పార్టీ తిరస్కరించింది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే. ఆరోపణలు చేసింది కొండా సురేఖ కాదు.. ఆమె కుమార్తె. గతంలో రాజగోపాల్‌రెడ్డితో పాటు చాలా మంది నేతలు నేరుగా పార్టీపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లను తప్పుబట్టారు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## ఈ పని చేస్తే రేషన్ కార్డు కట్

దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్ : స్టాక్ మార్కెట్లలో మళ్లీ లాభాల పంట!

**ఇంటర్నెట్ డెస్క్, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** గత నాలుగు రోజులుగా పతనావస్థతో పెట్టుబడిదారులను వణికించిన దేశీయ స్టాక్ మార్కెట్లకు చివరికి ఉపశమనం లభించింది. అమెరికాలో వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు వెలువడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలు వీచాయి, ఇది మన దలాల్ స్ట్రీట్‌కు భారీ ఊరటనిచ్చింది. శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభం నుంచే సూచీలు లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఉదయాన్నే 76,657.02 పాయింట్ల వద్ద బలంగా ప్రారంభమై, రోజంతా కొనుగోళ్ల మద్దతుతో జోరు కనబరిచింది. ఇంట్రాడేలో ఒక దశలో 76,883.14 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్, మార్కెట్ ముగిసే సమయానికి 362.57 పాయింట్ల భారీ



లాభంతో 76,515.43 వద్ద స్థిరపడింది. మరోవైపు నిఫ్టీ కూడా అదే బాటలో పయనించి 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 84.49 వద్ద కొనసాగుతోంది. ఈ లాభాల పంటలో ప్రధానంగా టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, ఆదానీ పోర్ట్స్ వంటి దిగ్గజ షేర్లు బాగా రాణించి సూచీలను ముందుకు నడిపించాయి. అయితే భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు మాత్రం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాల్లో ముగిశాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ పీపా ధర 95.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం పసిడి మెరుపులు విరజిమ్ముతూ ఔన్సు ధర 4,472 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. నాలుగు రోజుల నష్టాల తర్వాత లభించిన ఈ పుంజుకోలు తాత్కాలిక ఉపశమనమే అయినప్పటికీ, గ్లోబల్ మార్కెట్ సంకేతాలు స్థిరంగా ఉంటే తప్ప రికవరీ నిలబడదు. కాబట్టి పెట్టుబడిదారులు గుడ్డిగా కొనుగోళ్లు జరపకుండా హెచ్చరికతో వ్యవహరించడం శ్రేయస్కరం.

## అమరుడు ఉమేశ్‌చంద్ర ధైర్యసాహసాలు అమూల్యం

### సిపి సజ్జనర్ ఘన నివాళి!



**హైదరాబాద్, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర 27వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయ నకు ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్ఆర్ నగర్‌లోని ఉమేశ్‌చంద్ర విగ్రహం వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ పాల్గొని పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, పోలీసు శాఖలో ఉమేశ్‌చంద్రకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని, చెరగని ముద్రను గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన అసమాన ధైర్యసాహసాలు, నిబద్ధత నేటికీ పోలీసు అధికారులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని సజ్జనర్ పేర్కొన్నారు. అత్యంత కఠినమైన పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకుండా ప్రజల భద్రత కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన ఆయన జీవితం, యువ అధికారులకు ఎల్లప్పుడూ మార్గదర్శకమని కొనియాడారు. పోలీసు వృత్తిలో కర్తవ్యనిష్ఠ, నిజాయితీ, అంకితభావం ఎంత కీలకమో ఉమేశ్‌చంద్ర తన స్వల్పకాలిక సేవల ద్వారానే ప్రపంచానికి చాటిచెప్పారని ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. శాంతిభద్రతల పరిరక్షణలో క్రియాశీల పాత్ర పోషించడమే కాకుండా, ప్రజల గుండెల్లో చెరగని విశ్వాసాన్ని సంపాదించుకున్న అరుదైన అధికారుల్లో ఆయన ఒకరని గుర్తుచేశారు. ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన అటువంటి మహోన్నత అధికారి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన బాటలోనే సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమేశ్‌చంద్ర అందించిన సేవలు కేవలం పోలీసు వ్యవస్థకే కాకుండా, సమస్త సమాజానికి నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో పలువురు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఉమేశ్‌చంద్ర విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన అమరత్వానికి గుర్తుగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. వ్యవస్థ బలోపేతానికి, శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఉమేశ్‌చంద్ర వంటి సాహసోపేత అధికారులు పోలీసు రంగానికే గర్వకారణమని సజ్జనర్ పునరుద్ఘాటించారు. రాబోయే తరాల పోలీసు అధికారులు కూడా ఆయన ఆదర్శాలను, విలువలను వృత్తి జీవితంలో అనుసరించాలని సూచించారు.


## పరిశోధనలకు సరికొత్త బాట

### పంజాబ్ వర్సిటీలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పర్యటన!



**చండీగఢ్, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఉపరాష్ట్రపతి, పంజాబ్ యూనివర్సిటీ ఎక్స్‌అఫీషియో చాన్స్‌లర్ సి.పి. రాధాకృష్ణన్ గురువారం విశ్వవిద్యా లయాన్ని సందర్శించి, పలు అత్యా ధునిక పరిశోధనా సదు పాయాలు, సాంకేతిక వేదికలను లాంఛనంగా ప్రారంభించారు. విద్యా రంగంలో గుణాత్మక మార్పులతో పాటు శాస్త్రీయ పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఈ కేంద్రాలు మైలురాయిగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా సోఫిస్టికేటెడ్ అనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్ ఫెసిలిటీ మరియు సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ల్యాబొరేటరీస్ పరిధిలో నూతనంగా రూపుదిద్దుకున్న అడ్వాన్స్‌డ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీని ఉపరాష్ట్రపతి జాతికి అంకితం చేశారు. ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, యంగ్ సైంటిస్టులు మరియు పరిశోధకులకు అంతర్జాతీయ స్థాయి విశ్లేషణ పరికరాలు, సాంకేతిక వనరులు సులువుగా లభించనున్నాయి. పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, వాణిజ్యపరమైన పురోగతి దిశగా సాగాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పంజాబ్ యూనివర్సిటీ టెక్ ఇన్నోవేషన్ ఫోరం (పీయూ-టీఐఎఫ్)ను కూడా ఆయన ప్రారంభించారు. నూతన సాంకేతిక ఆలోచనలకు ఊపిరిపోస్తూ, పరిశోధన ఆధారిత స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఈ వేదిక ఎంతగానో తోడ్పడుతుందని అధికారులు వెల్లడించారు. విద్యాసంస్థలు, పరిశోధనా రంగాలు మరియు పారిశ్రామిక జగత్తు మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని పెంచడంలో ఈ ఫోరం కీలక వారధిగా పనిచేస్తుందని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నేటి ఆధునిక యుగంలో పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలే దేశాభివృద్ధికి ప్రధాన చోదక శక్తులని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. విశ్వవిద్యాలయాలు కేవలం తరగతి గదుల బోధనకే పరిమితం కాకుండా, దేశ అవసరాలను తీర్చే ఆవిష్కరణల కేంద్రాలుగా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ తన ప్రతిభను చాటాలంటే సాంకేతిక విద్య, శాస్త్రీయ పరిశోధనలకు అత్యున్నత ప్రాధాన్యమివ్వడం అనివార్యమని స్పష్టం చేశారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందన్నారు. పంజాబ్ విశ్వవిద్యాలయం పరిశోధనా రంగాన్ని పరుగులు తీంగిచేందుకు చేపడుతున్న ఈ ప్రగతిశీల చర్యలను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో ఈ క్యాంపస్ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## సరిహద్దుల్లో ఉమ్మడి వ్యూహం : సైన్యం, వాయుసేనల అత్యున్నత భేటీ!



**చండీమందిర్, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత సరిహద్దు భద్రత, రక్షణ సన్నద్ధతను మరింత పటిష్ఠం చేసే దిశగా త్రివిధ దళాల సమన్వయంలో కీలక అడుగు పడింది. భారత వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ చండీమందిర్ మిలిటరీ స్టేషన్‌ను సందర్శించి, పశ్చిమ కమాండ్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ పుష్పేంద్ర సింగ్‌తో అత్యున్నత స్థాయి భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ కమాండ్ సీనియర్ సైనికాధికారులతో కలిసి ప్రస్తుత భద్రతా పరిస్థితులు, రక్షణ దళాల కార్యాచరణ సామర్థ్యాలు, సంయుక్త సన్నద్ధతపై వారు సమగ్రంగా సమీక్షించారు. దేశ సరిహద్దుల రక్షణలో సైన్యం, వాయుసేనల మధ్య పరస్పర అవగాహన, వ్యూహాత్మక సమన్వయం ఎంతైనా అవసరమని ఈ భేటీలో ఇరు వర్గాలు స్పష్టం చేశాయి. భవిష్యత్తులో ఎదురయ్యే ఏ విధమైన భద్రతా సవాళ్లనైనా తక్షణమే, సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వేగవంతమైన స్పందన వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సాంకేతిక పరిజ్ఞానం, సమాచార వ్యవస్థల మార్పిడిలో పరస్పర సహకారాన్ని పెంచుకుంటూ సంయుక్త వ్యూహాలను అమలు చేయడానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులు అభిప్రాయపడ్డారు. ఆధునిక యుద్ధ తంత్రంలో విభిన్న దళాల మధ్య ఉండే నిరంతర సమన్వయమే విజయానికి మూలస్తంభమని, దానికి అనుగుణంగానే శిక్షణా కార్యక్రమాలు, యుద్ధ ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయని వెల్లడించారు. పశ్చిమ కమాండ్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వాయుసేన అధికారులతో, సిబ్బందితో ఎయిర్ చీఫ్ మార్షల్ ప్రత్యేకంగా మాట్లాడారు. దళాల మధ్య సమన్వయాన్ని నిలబెట్టడంలో వైమానిక యోధులు చూపుతున్న రక్షణ పటిమను, నిబద్ధతను ఆయన కొనియాడారు. దేశ రక్షణలో ప్రతి సైనికుడి పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## యూత్ పోలరైజేషన్.. ఏపీలో కొత్త పరిణామం!

ఏపీ రాజకీయాల గురించి బయట వారు చెప్పే మాట ఒక్కటే. సంకుల రాజకీయ సమరం అని. అది నిజమే కూడా. దేశంలో అన్ని చోట్లా కుల రాజకీయాలు ఉంటాయి. కానీ ఏపీలో అయితే అవి బాహాటం అయిపోతూంటాయి. మితిమీరిన అభిమానంతో అవి అతి ఉత్సాహం చూపిస్తూంటాయి. ఏపీ పాలిటిక్స్ ని లోతుగా అధ్యయనం చేస్తే ఎన్నో విషయాలు కనిపిస్తాయి. గతంలో కులాల ఆరాటాలు పోరాటాలు ఒక తరం వారికే పరిమితం అయ్యేవి. అవి యువత దాకా వచ్చేవి కావు, యూత్ అయితే తమకు ఏ పరిమితులూ లేవని అంటూ తమకు నచ్చిన తీరుతో ఉండేది. కానీ ఇటీవల కాలంలో యూత్ లో కూడా సామాజికపరమైన పోలరైజేషన్ కనిపిస్తోంది. జెన్ జీ తరం అయితే ఇలాంటి జాఢ్యం లేదు కానీ వాటికి అందని తరం అతీతమైన తరంలోనే ఇవి ఎక్కువగా కనిపిస్తున్నాయి.

**లాభమేనా లేక :**

యువతను అంతా భావి దేశ నిర్మాతలుగా చూస్తారు. వారి చేతిలో ఎక్కువ కాలం దేశం ఉంటుంది అని కూడా నమ్ముతారు. అయితే యూత్ లో కుల రహిత భావనలు ఉంటే ఫరవాలేదు కానీ వాటినే నమ్ముకుని అందులోనే కమ్ముకుని కుమ్ముకుపోతూంటేనే ఏమి జరుగుతోంది అన్నదే అంతా చర్చించే పరిస్థితి ఉంటోంది. ఏపీలో యూత్ కూడా పార్టీల పరంగా రాజకీయాల పరంగా భారీగా చీలిపోయారు. వారికి నచ్చిన పార్టీ అయితే చొక్కాలు చింపుకునేటంత ప్రేమాభిమానాలు కురిపిస్తూంటారు, నచ్చని వారితో అయితే ఎందాకైనా కయ్యానికి అని సై అంటూంటారు. ఇక వారి నాయకుడికి గ్లామర్ క్రేజ్ ఎంత ఎక్కువ ఉంటే అంతలా వారు కూడా వీధుల్లో వీరంగం వేసే పరిస్థితి కూడా కనిపిస్తోంది. మరి ఈ రకంగా యూత్ లో రాజకీయ చైతన్యం రావడానికి లాభంగా చూడాలా లేక వేరే విధంగా ఆలోచించాలా అన్నదే అర్థం కావడం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

**ఒక్కటిగా నిలిచి :**

తాజాగా చూస్తే ఒక పార్టీ అధినాయకుడి బర్త్ డే వేడుక వచ్చింది. అంతే ఆయన సామాజిక వర్గం అని చెప్పుకునే కుర్ర కారులో ఊపు మామూలుగా లేదు, బైక్ ర్యాలీలు తీసారు, వీధుల్లోకి వచ్చి హడావుడి చేశారు, సందడిగా సంబరాలు చేశారు. అది అసలు మామూలుగా లేదని అంటున్నారు. తాము చదివే చోట తాము పనిచేసే చోట తాము కలిసి మెలసి ఉండే చోట తమ వర్గం వారైతే చాలు అంతా కట్టుగా జట్టుగా నిలిచి మరీ సదరు పార్టీ అధినేతకు నీరాజనాలు పలికారు. వారిలో ఏదో తెలియని అభిమానం, దానితో పాటు వెర్రి ఆవేశం ఇవన్నీ వేడుక సందర్భంగా కనిపించాయి. తమ పుట్టిన రోజే వచ్చినంతగా తమ కుటుంబంలోనే పండుగ చేసుకున్నట్లుగా ఒక వర్గం యూత్ చేసిన ఈ సంబరాలు అంబరాన్ని దాటాయి. దీంతో సదరు పార్టీ పెద్దలు అయితే యూత్ అంతా మావైపే అని ఒక అంచనాకు వస్తున్నారు.

**దురాభిమానం కాకుంటేనే :**

ఎవరికైనా తమ ఇంటి పేరు ఒంటి పేరు ఎంతో ఇష్టం. అది సహజం కూడా. అయితే అదే పనిగా వేలం వెర్రిగా వ్యవహరిస్తేనే ఇబ్బంది అని అంటున్నారు. సమాజంలో అందరూ ఉంటారు, ఎవరి విజయం అయినా అందరితో సాధ్యపడుతుంది. కానీ ఇలా ఓపెన్ గా చూపించే అభిమానం ఒక్కోసారి దురభిమానంగా మారి అసలుకే ఎసరు తెస్తుందని కూడా అంటున్నారు. ఏది ఏమైనా ఏపీలో యూత్ పోలరైజేషన్ ప్రత్యేకించి ఒక బలమైన సామాజిక వర్గం లో జరగడం అంటే ఏ రకమైన రాజకీయ సమీకరణలకు తెర తీస్తుంది అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## 2 నిమిషాల్లో ఇంటికి.. ఇంతలో ప్రమాదం



### అన్నదమ్ములు మృతి

**మల్కిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ఘోర ప్రమాదం జరిగి అన్నదమ్ములిద్దరు మృతి చెందారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా మల్కిపురం మండలం లక్కవరం శివారు ఓఎన్జీసీ సైట్ వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ముదునూరి రామభద్ర రాజు అలియాస్ రాంబాబు రాజు, అతని సోదరుడు వెంకటసుబ్బరాజులు రొయ్యలు, ఎరువుల వ్యాపారం నిర్వహిస్తారు. ఇద్దరూ వారి భార్యలతో కలసి బంధువుల ఇంటికి భీమవరం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి శుక్రవారం ఉదయం స్వగ్రామానికి వస్తుండగా.. లక్కవరం ఓఎన్జీసీ సైట్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామభద్ర రాజు, వెంకటసుబ్బరాజు అక్కడికక్కడే మృతి చెందారు. తోడికోడళ్లు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు స్పందించి వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. మరో 2 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ఈ ప్రమాదం జరిగింది. రామభద్రరాజుకు ఇద్దరు కుమారులు కాగా.. ప్రస్తుతం వారు అమెరికాలో ఉంటున్నారు. వెంకటసుబ్బరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఖమ్మంలో మ్యూల్ ఖాతాలపై టీజీసీఎస్బీ దాడులు

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖమ్మంలో మ్యూల్ బ్యాంక్ ఖాతాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) దాడులు చేసింది. సైబర్ మోసాలకు సహకరిస్తున్న ఇద్దరు నిందితులు మురళీకృష్ణ, సాయి నివాస్‌లను టీజీసీఎస్బీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు సైబర్ మోసాలకు 10 మ్యూల్ ఖాతాలు ఇచ్చినట్లు గుర్తించారు. 11 బృందాలు, 40 మంది పోలీసులతో టీజీసీఎస్బీ ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. సైబర్ మోసాల డబ్బు తరలింపునకు మ్యూల్ ఖాతాలు వినియోగిస్తున్నట్లు గుర్తించింది. చైనా ఆపరేటర్లతో సంబంధాలున్న టెలిగ్రామ్ గ్రూపులపై టీజీసీఎస్బీ దర్యాప్తు చేపట్టింది. ఆన్‌లైన్ గేమింగ్ చెల్లింపులకూ మ్యూల్ ఖాతాలను వినియోగించినట్లు గుర్తించింది. ఏటీఎం, చెక్కు విత్‌డ్రాయల్స్, మొబైల్ నంబర్లు, డివైజ్‌లపై టీజీసీఎస్బీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మ్యూల్ ఖాతాల కేసుల్లో ఇప్పటివరకు 52 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 121 మ్యూల్ ఖాతాలను గుర్తించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. మరో 273 అనుమానిత బ్యాంక్ అకౌంట్స్‌పై నిఘా ఉంచింది. 25 అనుమానిత బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.7.84 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. కమీషన్ కోసం బ్యాంకు ఖాతాలు ఇవ్వొద్దని ప్రజలను టీజీసీఎస్బీ హెచ్చరించింది.

### అనంతపురం జిల్లాలో

## ప్రైవేటు బస్సు దగ్ధం

**అనంతపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది.



అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరు వద్దకు రాగానే బస్సులో పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేశారు. 33 మంది ప్రయాణికులు బస్సులో నుంచి కిందకు దిగిన వెంటనే.. క్షణాల్లో బస్సు మొత్తం దగ్ధమైంది. ప్రాణ నష్టం తప్పడంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ ముఠాల చేతికి ఆనకట్టల సమాచారం

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరగాళ్ల చేతిలో కర్ణాటకలోని ఆనకట్టలకు సంబంధించిన సమాచారం పడింది. డీఎస్ఓ ప్రస్తుతం కేఆర్ఎస్, భద్ర, వరాహి, లింగనమక్కి, హారంగి, హేమావతి, తుంగభద్రతో పాటు ప్రధాన జలాశయాల్లో నీటి సేకరణ సామర్థ్యం, ప్రవాహ మార్గం, క్రస్ట్ గేట్ల వివరాలు, భద్రత తదితర అంశాలను నిర్వహిస్తూ వస్తోంది. డీఎస్ఓకు చెందిన వెబ్‌సైట్ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. యూకే లేదా అమెరికా నుంచి వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారని ప్రాథమిక విచారణలో గుర్తించారు. సంస్థ ప్రతినిధుల ఫిర్యాదుతో సైబర్ కమాండ్ సెంటర్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

**పెద్దవడుగూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున సుమారు 2:50 గంటల సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. అందులో ఉన్న ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఇంటర్‌సిటీ ప్రైవేట్ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 33 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మిడుతూరు వద్ద బస్సు వెనుక భాగంలో మంటలు వ్యాపించాయి. ప్రయాణికులను అప్రమత్తం చేసి దింపివేశారు.



# విశ్వంవాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




శనివారం, 05 సెప్టెంబర్, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత    www.viswamvoice.com


### భావి భారత నిర్మాతలు

## అక్షర దీపాలు వెలిగిస్తున్న గురు లోకానికి వందనం!

భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఒక గొప్ప సంప్రదాయంగా వస్తోంది. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను నిర్వహించడం ఆయన విద్యా రంగానికి చేసిన అమూల్యమైన సేవలకు నిజమైన నివాళి. ఒక దేశ భవిష్యత్తు, పురోగతి తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటాయన్న సత్యాన్ని చాటిచెబుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్రను ఈ రోజు ప్రత్యేకంగా స్మరించుకుంటారు. విద్యార్థి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత చెరగని ముద్ర వేసేది గురువే. కేవలం పుస్తకాల్లోని పాఠాలను నూరిపోయడమే కాకుండా, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనోధైర్యాన్ని, క్రమశిక్షణను, నైతిక విలువలను నూరిపోస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వర్ణనాతీతం. ప్రాచీన గురుకుల వ్యవస్థ నుండి నేటి డిజిటల్ యుగం వరకు కాలం మారినా, బోధనా పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చినా గురువు స్థానం మాత్రం చెక్కుచెదరలేదు. కృత్రిమ మేధస్సు, ఆన్‌లైన్ తరగతులు వంటి అత్యాధునిక



సాంకేతికతలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఉపాధ్యాయుడికి అవి ఏనాటికీ ప్రత్యామ్నాయం కాలేవు. సమాచారాన్ని అందించడం వేరు, దానిలోని జ్ఞానాన్ని అర్థం చేసుకునే విచక్షణను విద్యార్థిలో పెంపొందిం చడం వేరు. ఈ కీలక బాధ్యతను ఉపాధ్యాయులు మాత్రమే సమర్థవంతంగా నిర్వర్తించగలరు. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన కష్టకాలంలోనూ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సరైన మౌలిక వసతులు లేనప్పటికీ, సవాళ్లను దాటుకుంటూ విద్యార్థులకు జ్ఞానబోధ అందించడంలో ఉపాధ్యాయులు చూపిన అంకితభావం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకంది. దేశానికి వెన్ను ముకగా నిలిచే శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, రాజకీయ నాయకుల వెనుక ఒక గొప్ప గురువు ప్రేరణ ఖచ్చితంగా ఉంటుంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సరికొత్త సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు, వారికి తగిన శిక్షణ, వసతులు కల్పించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే సన్మాన కార్యక్రమాలు, విద్యార్థులే స్వయంగా ఉపాధ్యాయులై పాఠాలు చెప్పే వేడుకలు గురు-శిష్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, భావి భారత నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉపా ధ్యాయ లోకానికి సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.

## వైసీపీలోకి వెంటూరు వాసులు..


### ఎమ్మెల్సీ సమక్షంలో చేరికలు



**రాయవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై అభిమానంతో రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన 16 మంది కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వాసంశెట్టి రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ చాపల అబ్బన్న అధ్యక్షతన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల సమక్షంలో వీరంతా వైకాపా కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో ఉందుర్తి రాజేష్, చాపల సందీప్, ఖండవిల్లి అశోక్, ఖండవిల్లి కిషోర్, ఖండవిల్లి విజయ్, ప్రొసుపోలు బాబి, ప్రొసుపోలు మదన్, దార్ల రవిచందర్, దార్ల విజయ్‌చందర్, ఖండవిల్లి సురేంద్ర, ఖండవిల్లి మురళీకృష్ణ, లంక నాగేంద్ర, చాపల చిన్నబాబు, మురమళ్ల అజయ్, ఖండవిల్లి తాతాజీ, ఖండవిల్లి విక్రమ్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వెంటూరు వైసీపీ ముఖ్య నాయకులు వాసంశెట్టి వెంకటరావు, మోర్త ప్రసాద్, రవ్వ వెంకటరావు, చాపల వినోద్, గొడితి ప్రసాద్, మేడిశెట్టి సాయి శ్రీనివాస్ కుమార్ (ఎంఎస్), నీల శివతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రద్దీకి అనుగుణంగా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి

### 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎరుగుతున్న రోగుల రద్దీకి అనుగుణంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు, వైద్య పరిక రాలు, రోగుల సౌకర్యాలను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన పనులు, పరికరాలు, మౌలిక వసతులపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించి రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని మౌలిక వసతులు, వైద్య సేవలు, రోగుల రద్దీ, పరికరాల అవసరాలు, అభివృద్ధి పనులపై వైద్యులు, అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత వసతులు సరిపోతున్నాయా..? ఇంకా ఎలాంటి సౌకర్యాలు అవసరం..? అనే అంశాలపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2 వేల మందికి పైగా ఓపీకి వస్తున్న పరిస్థితుల్లో, గతంలో 200-400 మంది ఓపీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన డిస్పెన్సరీ, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, వెయిటింగ్ ప్రాంతాలు సరిపోవడం లేదని వైద్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డిస్పెన్సరీ వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు షెడ్, వెయిటింగ్ ప్రాంతం, కౌంటర్ల విస్తరణ వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఎమ్మెల్యే వాసు సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన నిధులను వివిధ మార్గాల్లో సమీకరించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సిఎస్ఆర్ నిధులు, ఎంపీ ల్యాడ్స్, ప్రత్యేక గ్రాంట్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు వంటి అవకాశాలను వినియోగించుకోవాలని అధికారులతో చర్చించారు. పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ముందుగానే సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఆసుపత్రి భవనానికి సంబంధించిన మరమ్మతులు, గోడల పునరుద్ధరణ, గ్లాస్ వర్క్స్, ఇతర ప్రాథమిక వసతులకు అవసరమైన అంచనాలను సిద్ధం చేసి సంబంధిత శాఖలకు సమర్పించాలని తెలిపారు. సీఎస్ఆర్ ద్వారా సుమారు రూ.3 కోట్ల స్థాయిలో నిధులు సమీకరించే అవకాశాలను పరిశీలిస్తున్నామని, అవసరమైతే ప్రజాప్రతినిధుల ద్వారా సంబంధిత సంస్థలకు ప్రతిపాదనలు పంపించి నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. మందులను ఒక విభాగం నుంచి మరొక విభాగానికి తరలించేందుకు ప్రత్యేకంగా క్లోజ్డ్ మెడిసిన్ క్యారీయింగ్ బాక్స్ లేదా వాహన సదుపాయం అవసరమని గుర్తించి, ఇందుకు అయ్యే వ్యయాన్ని కూడా ప్రతిపాదనలో చేర్చాలని సూచించారు. పెరుగుతున్న రోగుల రద్దీ నేపథ్యంలో ఓపీ రిజిస్ట్రేషన్, మందుల పంపిణీ తదితర ప్రాంతాల్లో రోగులకు సమాచారాన్ని స్పష్టంగా అందించేందుకు మైక్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వాసు సూచించారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న పోస్టులు, కొత్త నియామకాలు, నోటిఫికేషన్లకు సంబంధించిన అంశాలపై కూడా అధికారులతో ఆయన చర్చించారు. కూటమి నాయకులు, ఆసుపత్రి వైద్యులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### మండపేటలో గణేష్ మండపాలకు

## అనుమతులు తప్పనిసరి


### డీజేలపై నిషేధం : టౌన్ సీఐ సురేష్



**మండపేట టౌన్, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే ప్రతి గణేష్ మండపానికి పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ టివి రంగారావు, టౌన్ సీఐ సురేష్‌లు పేర్కొన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో వినాయక ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై గోతులు తీసి పందిళ్లు వేయడం, ట్రాఫిక్ కు అంతరాయం కలిగించడం చేయరాదని పేర్కొన్నారు. డి జె సౌండ్ సిస్టమ్ లను పూర్తిగా నిషేధించామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన మండపాల కమిటీలపై భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**పుష్కరాల కోసం కమాండ్ కంట్రోల్ రూమ్...**

అఖండ గోదావరి పుష్కరాలు-2027 నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు చొరవతో పట్టణ భద్రత కోసం రూ.86 లక్షల వ్యయంతో ఏడిద రోడ్డులోని పాత మీ-సేవ కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్, పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇందుకోసం శుక్రవారం కమిషనర్, సీఐ, మున్సిపల్ డీఈ, ఏఈలు సంయుక్తంగా స్థల పరిశీలన చేసి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో డి ఈ శ్రీనివాస్, ఏ ఇ దాసరి పవన్ సిబ్బంది పాల్గొన్నారు.







## ఆర్యాపురంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

### భక్తులతో కిటకిటలాడిన కృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆర్యాపురం శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అండ్ ఆశ్రమం శ్రీ గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు మంగళ హారతి, తులసీ ప్రదక్షిణ, 5 గంటలకు నగర సంకీర్తన, 9 నుంచి 11 గంటల వరకుగోపూజ భక్తి శ్రద్ధలతో జరిగింది. భక్తులు తరలివచ్చి శ్రీ కృష్ణ స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భజన, హరినామ సంకీర్తన అనంతరం చిన్నారులకు బాలకృష్ణ వేణధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు పలు రకాల వేషధారణ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద ఉట్టికొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు. వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరిగిందని ఆశ్రమ ఇన్‌చార్జ్ హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అండ్ ఆశ్రమం వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల భక్తి వైభవ పూరీ గోస్వామి వారి ఆశీస్సులతో భక్తి కంకణ బన మహరాజ్ శ్రీ కృష్ణ ఆవిర్భావ విశిష్టతపై ఉపన్యాసం



ఇచ్చారు. వేద పండితులచే వేద పఠనం, శ్రీ బాల గోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, ఫల పుష్పాతో అభిషేకం నిర్వహించారు. 56 వెండి పాత్రలతో 56 రకాల పిండి వంటలతో మహారాజభోగ నివేదన అనంతరం 108 దీపాలతో శ్రీ రాధాకృష్ణ, గోదావరి మాతకు మహా హారతి తరువాత తీర్థ, ప్రసాద వితరణ చేసినట్టు తెలిపారు. 5వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద నందోత్సవం జరుగుతుందని హరిదాస్ బ్రహ్మచారి పేర్కొన్నారు.






# ధర్మం, న్యాయం, మానవ విలువలకు మార్గదర్శకుడు శ్రీకృష్ణుడు

## పి.గన్నవరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్



**పి.గన్నవరం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో పవిత్ర వైనతేయ నది తీరంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మంత్రి జన్మస్థల పూజ, ఎడ్లబండిలో స్వామివారి ఊరేగింపు, సుదర్శన నరసింహ హోమం, అభిషేకం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ "కృష్ణం వందే జగద్గురుమ్" అని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు ధర్మం, న్యాయం, మానవ విలువలకు మార్గదర్శకుడని, భగవద్గీత సందేశం సమాజానికి శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, సుభిక్షంతో జీవించాలని ఆకాంక్షించారు. రామసేతు భక్త బృందం మరియు గరుడవేగ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పి గన్నవరం కో కన్వీనర్ మోకా ఆనందసాగర్, టిడిపి నాయకులు షేరు శ్రీనుబాబు, నిమ్మకాయల శేషు, భక్తులు, గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఈతకోట కనకదుర్గమ్మ గుడిలో

# ముత్తయిదువుల సామూహిక వరలక్ష్మి వ్రతం





**రావులపాలెం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం పరిధిలో ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంతన కొత్త సెంటర్ నందు కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం నాడు ముత్తైదువులతో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు శ్రావణమాసంలో నాల్గొవ శుక్రవారం పురస్కరించుకుని ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రత పూజల్ని ఆలయ అర్చకులు ఖండవల్లి నారాయణచార్యులు (నాని). ఖండవల్లి శ్రీనివాసాచార్యులు నిర్వహించారు ముత్తైదువులు ఈ పూజలో పాల్గొని శ్రావణమాసం వ్రతాన్ని ఆచరించారు పలు రకాల పూజ సామాగ్రిని ఆలయ కమిటీ వారు అందజేశారు అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొని దుర్గాదేవి. దుర్గామాత అమ్మవార్లను దర్శించుకుని అన్న ప్రసాదం. తీర్థప్రసాదాలను స్వీకరించారు ఆలయ దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ జనిపిరెడ్డి గోవిందరావు. కమిటీ సభ్యులు కలిసి భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు

### ప్రజల సమస్యలు నేరుగా విని

# పరిష్కరించడమే తొలి ప్రాధాన్యత : ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా విని, వాటిని పరిష్కరించడమే తమ తొలి ప్రాధాన్యత అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. శుక్రవారం అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 32 వినతిపత్రాలను ఎమ్మెల్యే స్వీకరించారు. సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాననే భరోసాతో వచ్చిన ప్రజల సమస్యలను ఆయన ఓపికగా విని, వినతిపత్రాలను పరిశీలించారు. సివిల్, రెవెన్యూ, పెన్షన్లు, వ్యక్తిగత, ప్రాంతీయ సమస్యలకు సంబంధించిన వినతులపై స్పందించిన ఎమ్మెల్యే, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రోడ్డు ప్రమాదం

### యువతికి తీవ్ర గాయాలు..



**అమలాపురం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మహిపాల వీధి లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ట్రక్, ప్యాసింజర్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ప్యాసింజర్ ఆటోలో ప్రయాణిస్తున్న ఓ యువతికి,యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటంతో యువతి వివరాలు తెలియరాలేదు. ప్రమాదం కారణంగా ఆలయం సమీపంలో ట్రాఫిక్ స్తంభించడంతో పట్టణ ఎస్ఐ కిషోర్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐ ఏసుబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

### కె. గంగవరం జడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు

# ఏడుకొండలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**కే.గంగవరం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏడుకొండలకు ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన అందిస్తున్న నిస్వార్థ సేవలను, బోధనలో చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను గుర్తించిన అధికారులు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. పాఠశాలలో కేవలం చదువు మాత్రమే కాకుండా, విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడంలో ఏడుకొండలు ఎంతో ముందుంటున్నారు. తెలుగు భాషా ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులను వక్తృత్వం, వ్యాసరచన వంటి పోటీలకు సన్నద్ధం చేయడంలో ఆయన ప్రత్యేక కృషి చేస్తున్నారు. అంతేకాకుండా, పాఠశాలలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక చైతన్య వేడుకల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న అంకితభావంతో పాటు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించడం పట్ల తోటి ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

### ద్రాక్షారామం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు

# పేరిచర్ల శేఖర్‌కు జిల్లా ఉత్తమ హెచ్ఎం అవార్డు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న పేరిచర్ల శేఖర్‌కు ఈ ఏడాది జిల్లా ఉత్తమ గెజెటెడ్ ప్రధానోపాధ్యాయుల అవార్డు లభించింది. పాఠశాల విద్యాభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషే ఈ పురస్కారానికి ప్రధాన కారణం.ఇటీవల విడుదలైన పదవ తరగతి (ఎస్.ఎస్.సి) ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థి 593 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో స్థానం సాధించగా, సుమారు 40 మందికి పైగా విద్యార్థులు 500 మార్కులకు పైబడి ప్రతిభ కనబరిచారు. అలాగే ఐదుగురు విద్యార్థులకు ఐఐఐటి సీట్లు దక్కడం మరియు పలువురికి ఎన్.ఎం.ఎం.ఎస్ ఉపకార వేతనాలు రావడంలో ఆయన ప్రత్యేక చొరవ, పర్యవేక్షణ కీలకపాత్ర పోషించాయి. విద్యా రంగంలో సాధించిన ఈ ఉత్తమ ఫలితాలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు, ఆయనను కోనసీమ జిల్లా ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపిక చేశారు.

### శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో విమానానికి

# తప్పిన పెను ప్రమాదం

### స్తంభాన్ని ఢీకొట్టిన పైలట్ నిర్లక్ష్యం!



**శ్రీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీనగర్ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం ఒక తీవ్ర నిర్లక్ష్యపు ఘటన వెలుగుచూసింది. నవీ ముంబయి నుంచి వచ్చిన ఇండిగో విమానం రన్‌వేపై సురక్షితంగా ల్యాండ్ అయినప్పటికీ, ప్రయాణికులను దించేందుకు పార్కింగ్ ఏరియాకు వెళ్తున్న సమయంలో ఊహించని ప్రమాదానికి గురైంది. పైలట్ లేదా గ్రౌండ్ సిబ్బంది అజాగ్రత్త వల్ల విమానం అదుపుతప్పి అక్కడ అమర్చిన 'విజువల్ డాకింగ్ గైడెన్స్ సిస్టమ్' స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తీవ్రమైన ఢీకొనడం వల్ల విమానం ముందు భాగం తీవ్రంగా దెబ్బతిని ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో పదుల సంఖ్యలో ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తూ విమానం చాలా నెమ్మదిగా కదులుతుండటంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకుండా ప్రాణాపాయం తప్పిందని, అందరినీ సురక్షితంగా కిందకు దించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక మానవ తప్పిదమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. రన్‌వేపై విమానం దిగిన తర్వాత పార్కింగ్ జోన్‌లోనే ఇలాంటి ప్రమాదం జరగడం విమానయాన భద్రతా ప్రమాణాల తీవ్ర లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఆకాశంలో ఎంత సురక్షితంగా ప్రయాణించినా, నేలపై ల్యాండ్ అయ్యాక ఇలాంటి చిన్న చిన్న పొరపాట్లు వందలాది మంది ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉండే విమానాశ్రయ సిబ్బంది, పైలట్ల బాధ్యతారాహిత్యంపై కఠిన చర్యలు తీసుకోకపోతే ముమ్ముందు మరింత పెద్ద మూల్యం చెల్లించుకోక తప్పదు.

### తపాల శాఖ ద్వారా

# రియామని ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు

### డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ చెరుకూరి శ్రీనివాస్

**అమలాపురం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా భారత ప్రభుత్వం తపాల శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా రియా మని ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు ఇప్పుడు మన తపాల శాఖలో అందుబాటు లో ఉన్నాయని అమలాపురం డివిజన్ తపాలా శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ శ్రీ చెరుకూరి శ్రీనివాస్ గారు తెలియజేశారు. ఇంటర్నేషనల్ మనీ ట్రాన్స్ఫర్ సేవలు మీ గ్రామంలోని తపాలా శాఖ కార్యాలయంలో బ్రాంచ్ తపాల శాఖ పోస్ట్ మాస్టర్ వద్ద అతి సులభంగా పొందుకొనే సౌకర్యం కల్పించడం జరిగిందని ప్రజలు విదేశాల నుండి నగదు పంపిణీ జరుపుకునే వాళ్లు సంబంధిత లబ్ధిదారు ఆధార్ పాన్ మరియు లావా దేవి పిన్ నెంబర్ వివరాలతో మీ దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ ను సందర్శించి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

### ద్రాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయంలో

# వైభవంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షరామం శ్రీ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం నాల్గవ వరం సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. దాతల ఆర్థిక సహకారంతో పూజల్లో పాల్గొన్న భక్తులకు చీర, రవికె గుడ్డ మరియు పూర్తి పూజా సామాగ్రిని పూర్తిగా ఉచితంగా అందజేశారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో బారులు తీరి పూజా సామగ్రిని స్వీకరించి భక్తిశ్రద్ధలతో వ్రతాల్లో పాల్గొన్నారు. ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా క్రమపద్ధతిలో ఏర్పాట్లు జరగడంతో భక్తులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. వ్రత మహోత్సవం అనంతరం సుమారు పది వేల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మరియు సహాయక కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఈ వివరాలను వెల్లడించారు. రామచంద్రపురం డిఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు ద్రాక్షారామ సబ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తును విజయవంతంగా నిర్వహించారు.



# పిఠాపురంలో శ్రావణ శోభ : 10 వేల మందికి పవన్ కళ్యాణ్ సారె!



**పిఠాపురం, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో తనకున్న పేగుబంధాన్ని, ప్రత్యేకానుబంధాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరోసారి నిరూపించుకున్నారు. శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నియోజకవర్గానికి చెందిన దాదాపు 10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా అందజేసి వారి ముఖాల్లో ఆనందం నింపారు. ప్రముఖ శక్తిపీఠమైన పిఠాపురం శ్రీ పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళల కోసం భారీ ఎత్తున సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. వ్రతానికి కావలసిన సమస్త పూజా సామగ్రిని ఉచితంగా సమకూర్చడమే కాకుండా, దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతిక అమ్మవార్ల దివ్యక్షేత్రంలో నిర్వహించిన ఈ మహోత్సవం వేకువజాము నుంచే ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి, సంప్రదాయబద్ధంగా గణపతి పూజ, కలశ పూజ, అష్టోత్తర శతనామావళి మరియు షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల ప్రారంభానికి ముందు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది మహిళలు తమ కుటుంబాల సౌభాగ్యం, ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. భక్తుల రద్దీని ముందే ఊహించిన నిర్వాహకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను ఐదు విడతలుగా విభజించి నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విడతల వారీగా వ్రతాలు జరిపించడంతో మహిళలు ఎలాంటి తోపులాటలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూజలు పూర్తి చేసుకోగలిగారు. కార్యక్రమం దిగ్విజయం కావడానికి పోలీసులు, ఆలయ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో పాటు జనసేన వాలంటీర్లు, వీరమహిళలు అహోరాత్రులు శ్రమించి సమన్వయంతో పనిచేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీటి వసతి, షామియానాలు, అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టారు. పూజ ముగిసిన అనంతరం పవన్ కళ్యాణ్ అందించిన పసుపు, కుంకుమ, చీరల కానుకలను అందుకున్న మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సంప్రదాయాలను గౌరవిస్తూ, తమను తోబుట్టువుల్లా ఆదరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా వేలాది మంది మహిళలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మైనర్ బాలికకు వివాహం జరిపించిన ఘటనపై కేసు నమోదు

## బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు : ఎస్సై టి.రామకృష్ణ



**కోటనందూరు, సెప్టెంబర్ 4 , విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండల పరిధిలో ఒక మైనర్ బాలికకు వివాహం జరిపించిన ఘటనపై కోటనందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మైనర్ బాలికకు వివాహం జరగబోతున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో సంబంధిత గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్వాడీ సిబ్బంది, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు మరియు చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది బాలిక కుటుంబ సభ్యులను సంప్రదించి, మైనర్ బాలికకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టంగా తెలియజేసి, వివాహం జరపవద్దని కౌన్సెలింగ్ చేయడంతో పాటు సంబంధిత అధికారుల ద్వారా నోటీసు కూడా అందజేశారు. అంతేకాకుండా మైనర్ బాలికకు వివాహం జరపబోమని కుటుంబ సభ్యుల నుండి రాతపూర్వక హామీ కూడా తీసుకోవడం జరిగింది. అయినప్పటికీ 30.08.2026 తేదీన బాల్య వివాహం జరిగినట్లు సమాచారం మరియు సంబంధిత ఫోటోలు అధికారుల దృష్టికి రావడంతో, విషయాన్ని పరిశీలించి కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాల్య వివాహం చేయడం, చేయించడం, ప్రోత్సహించడం, సహకరించడం లేదా తెలిసి కూడా అడ్డుకోకుండా ఉండడం చట్టరీత్యా నేరం. మైనర్ బాలికలు లేదా బాలురకు వివాహం జరిపించే తల్లిదండ్రులు, బంధువులు, మధ్యవర్తులు, వివాహ నిర్వాహకులు మరియు సహకరించే ఇతర వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని. ఎవరైనా తమ గ్రామం లేదా పరిసర ప్రాంతాల్లో బాల్య వివాహం జరగబోతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు, చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని బాల్య వివాహాలను అడ్డుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్సై రామకృష్ణ తెలియజేశారు. "మైనర్ పిల్లలకు వివాహాలు జరిపించవద్దు. బాల్య వివాహాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని" ఎస్సై హెచ్చరించారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఐదుగురు ఎంపిక



**కోటనందూరు, సెప్టెంబర్ 4 , విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో 5గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ ఏ శ్రీనివాసరావు తెలియజేశారు. కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కే వీరభద్రరావు, పాత కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కే ఎన్ వి సింగరాజు, ఎస్ఆర్ పేట ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న ఎస్ జి టి పొలమరశెట్టి ఇందూ దేవి, టి జే నగరం ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న ఎస్జీటీ షేక్ తాజుద్దీన్ బాబా, అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ సుర్ల సుమ ఎంపిక అయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగే ఒక కార్యక్రమంలో వీరికి అవార్డులు అందజేస్తారు. ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎన్నికైన వీరిని పలువురు ప్రజాప్రతినిధులు తోటి ఉపాధ్యాయులు ఉన్నతాధికారులు అభినందించారు.

# శివాలయంలో వెండి ధారా పాత్ర చోరీ

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కోటనందూరు పోలీసులు



**కోటనందూరు, సెప్టెంబర్ 4 , విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, కోటనందూరు గ్రామంలోని శివాలయం గర్భగుడిలో సుమారు 2.8 కేజీల బరువున్న వెండి ధారపాత్ర చోరీకి గురైన ఘటనపై కోటనందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి చెందిన గొంప ప్రభాకర ఉమా వెంకట గంగు నాయుడు, వయస్సు 49 సంవత్సరాలు, సదరు శివాలయానికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కోటనందూరు గ్రామానికి చెందిన అంకారెడ్డి ఫణీంద్ర కుమార్ 2022 జనవరి నెలలో సుమారు 2.8 కేజీల బరువున్న వెండి ధారాపాత్రను శివాలయానికి విరాళంగా అందజేశారు. అప్పటి నుండి సదరు ధారాపాత్రను శివాలయ గర్భగుడిలో భద్రపరుస్తున్నారు. 03.09.2026 సాయంత్రం సుమారు 6:00 గంటల సమయంలో ఆలయ పూజారి కొత్తలంక సాంబమూర్తి నైవేద్యం సమర్పించిన సమయంలో వెండి ధారపాత్ర గర్భగుడిలోనే ఉండగా, అనంతరం ఆలయ తలుపులు మూసి తాళం వేశారు. 04.09.2026 తెల్లవారుజామున సుమారు 5:00 గంటల సమయంలో పూజారి ఆలయానికి వెళ్లి చూడగా గర్భగుడి తలుపులు తెరిచి ఉండటం, తాళాలు కనిపించకపోవడం, గర్భగుడిలో ఉంచిన 2.8 కేజీల వెండి ధారాపాత్ర కనిపించకపోవడం గుర్తించారు. దొంగతనానికి గురైన వెండి ధారపాత్ర విలువ మార్కెట్ లో ప్రకారం సుమారు 7 లక్షల వరకు ఉంటుంది. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో సంబంధిత బి ఎం ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, గుర్తుతెలియని నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సాక్ష్యాలను సేకరించి నిందితులను గుర్తించి, చోరీ సొత్తును రికవరీ చేసేందుకు చర్యలు కొనసాగుతున్నట్లు ఎస్సై టి రామకృష్ణ తెలిపారు.

# జగన్నాధపురంలో త్రాగునీటి ఇబ్బందులు






**కోటనందూరు, సెప్టెంబర్ 4, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, జగన్నాధపురం గ్రామంలో త్రాగునీటికి ప్రజలు గత కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తాగునీటి కష్టాలను గుర్తించిన గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాతిరెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి ఇంటింటికి మంచినీరు అందిస్తున్నారు. సమస్య చాలా పెద్దదిగా ఉండడంతో భాస్కరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రాగునీటి అందిస్తున్నట్లు మాతిరెడ్డి భాస్కర్ తెలియజేశారు. మంచినీటిని ప్రతి ఇంటికి తీసుకొచ్చి ఇచ్చినందుకు ప్రజల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాతిరెడ్డి బాబులు, గుడివాడ శ్రీను, భీమిరెడ్డి తాతబ్బాయి, సుర్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# బృహత్ విశాఖ కార్పొరేషన్ దిశగా అడుగులు




మహా విశాఖ నగర పాలక సంస్థ వార్డుల పునర్విభజనపై ప్రిలిమినరీ నోటిఫికేషన్ తాజాగా విడుదల అయింది. దాంతో జీవీఎంసీలో 98 నుంచి 120 వార్డులను పెంచేందుకు మార్గం సుగమం అయింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జీవీఎంసీకి అందాయి. దీంతో జీవీఎంసీ వార్డుల పునర్ విభజన దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. అయితే 120 వార్డులుగానా లేక 150 వార్డులుగా పునర్ విభజన జరుగుతుందా అన్నది చర్చగా ఉంది. ఒక వైపు జీవీఎంసీని ఆనుకుని ఉన్న నాలుగు మండలాలు 79 పంచాయతీల భవితవ్యం ఏమిటి అన్నది తెలలేదని అంటున్నారు. వీటిని కూడా జీవీఎంసీలో విలీనం చేసి మొత్తంగా 150 వార్డులుగా చేసి మార్చి ఎన్నికలకు వెళ్లాలని ప్రజా ప్రతినిధుల నుంచి సూచనలు వస్తున్నాయి. ఈ విషయంలో మాజీ మంత్రి సీనియర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అయితే 150 వార్డులుగా జీవీఎంసీని చేయడం ఉత్తమం అని స్పష్టం చేస్తున్నారు. ఆయన ఇంకా దూరం వెళ్లి భోగాపురం ఎయిర్ పోర్టు ఉన్న ప్రాంతం అంతా కూడా జీవీఎంసీలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. అది ఇప్పట్లో జరగకపోయినా నాలుగు మండలాల విలీనం సంగతి ఏమిటి అన్నది చర్చకు వస్తోంది.

**కలిస్తే మేలుగానే :** ఇదిలా ఉంటే జీవీఎంసీతో కలసి ఇప్పటికే ఉన్న ఈ మండలాలను వేరు చేసి చూడడం వల్ల అభివృద్ధి కూడా కుంటుబడుతుందని ఒక అభిప్రాయం ఉంది. పైగా విశాఖకు వస్తున్న పరిశ్రమలు కూడా ఈ మండలాలలో ఉన్నాయి. దాంతో వాటికి కావాల్సిన పారిశ్రామికమైన మౌలిక సదుపాయల కల్పనను అందించేందుకు జీవీఎంసీలో ఉంటేనే భారీ ప్రయోజనం కలుగుతుందని అంటున్నారు. అలాగే ఏ అనుమతి కావాలన్న వేగంగా వస్తుందని అలాగే సిటీ లుక్ తో ఉంటే మరింత మేలు జరుగుతుందని అంటున్నారు. దీని మీద ప్రభుత్వం కూడా సుముఖంగా ఉందని అంటున్నారు.

**అలాగైతే మరింత లేట్ :** అయితే ప్రస్తుతం ఈ నాలుగు మండలాల్లో జరిగిన గ్రామ సభలలో ప్రజాభిప్రాయ సేకరణ సవ్యంగా లేదని మరో మారు జరపాలని కోర్టు నుంచి డైరెక్షన్ వచ్చినట్లుగా చెబుతున్నారు. దాంతో గ్రామ సభలు నిర్వహించి అభిప్రాయ సేకరణతో నివేదికలు సిద్ధం చేసిన తరువాత అంతా ఓకే అయితే విలీనం జరుగుతుంది. ఆ మీదట వార్డుల పునర్ విభజన జరగాల్సి ఉంది. ఈ మొత్తం తతంగం అంతా పూర్తి అయ్యేసరికి మరో ఆరేడు నెలలు పడుతుందని అంటున్నారు. దాంతో అక్టోబర్ లోగా పూర్తి చేయాలనుకుంటున్న స్థానిక ఎన్నికల్లో జీవీఎంసీ ఉండకుండా పోతుంది. ఈ కారణంగా ఇపుడు ఆ విలీనం వద్దు అంటున్నారు ఆశావహులు. ఇపుడు కాకపోతే మరెప్పుడు అని మరి కొందరు అంటున్నారు. ఈ విషయం ఇలా ఉండగానే 120 వార్డులతో జీవీఎంసీ పునర్ విభజన జరిగి తీరడం పక్కా అని అంటున్నారు.

**కసరత్తుకి సిద్ధం :** జీవీఎంసీలో 120 వార్డుల ముసాయిదా సరిహద్దుల వివరాలు సెప్టెంబర్ 5 నుంచి ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. జీవీఎంసీ వెబ్‌సైట్‌తో పాటు ప్రధానమైన 10 జోనల్ కార్యాలయాలు ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల్లో వివరాలు అందుబాటులో ఉంచుతున్నారు. ఇందులో సూచనలు అభ్యంతరాలను సెప్టెంబర్ 11వ తేదీలోపు జీవీఎంసీ కమిషనర్‌కు సమర్పించాలని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 98 వార్డులను 120 వార్డులుగా పునర్ విభజిస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ వార్డుల పునర్విభజన నియమాలు-1996కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 570 ప్రకారం జీవీఎంసీ పరిధిని 120 వార్డులుగా పునర్విభజిస్తూ ఆయా వార్డుల ముసాయిదా సరిహద్దుల వివరాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కోటనందూరు, సెప్టెంబర్ 4 , విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, తుని మండలం, డి పోలవరం గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగినవి. ఆలయ అర్చకుడు కోటమర్తి శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేకంగా అలంకరించిన శ్రీకృష్ణుడు విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపించారు. వందలాది మంది భక్తులు ఉదయం నుండి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడికి అందించిన భగవద్గీత యుగయుగాలుగా మానవాళికి మార్గ దర్శకంగా ఉందని కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఫలితం పై ఆసక్తి చూపకూడదనే నిస్కామ కర్మ సిద్ధాంతాన్ని శ్రీకృష్ణుడు బోధించాడని, సత్యం, ధర్మం, కర్తవ్యం, ఆత్మవిశ్వాసం సమభావం వంటి విలువలను గీత ద్వారా ప్రపంచానికి అందించారని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.





# ద్వారపూడి రైల్వే స్టేషన్ అభివృద్ధికి చర్యలు

## కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లాం : ఎంపీ గంటి హరీశ్ మాధుర్



**మండపేట టౌన్, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంట్ పరిధిలోని కీలకమైన ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఈ ఏడాదిలోగా చర్యలు తీసుకుంటామని అమలాపురం ఎంపీ గంటి హరీశ్ మాధుర్ తెలిపారు. మండపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక ప్రధాన రైల్వే స్టేషన్ ద్వారపూడి అని, ఈ ప్రాంత ప్రజలు రైలు ప్రయాణాల కోసం ఈ స్టేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ద్వారపూడి రైల్వే స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించామని, అక్కడ తాగునీరు, పారిశుద్ధ్యం, వాష్‌రూములు, వెయిటింగ్ హాల్, ఓవర్‌హెడ్ పాసేజ్, రైళ్ల రాకపోకల వివరాలు తెలిపే ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులు వంటి కనీస సదుపాయాలు కూడా సక్రమంగా లేవని గుర్తించామని చెప్పారు. ఈ సమస్యలను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్లను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నారని, అదే తరహాలో ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు కూడా అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. ద్వారపూడి స్టేషన్‌లో ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేయడానికి ఆరు నెలల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు గతంలో చెప్పినా ఇప్పటివరకు పూర్తి కాలేదని, ఈ విషయాన్ని కూడా కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ద్వారపూడి స్టేషన్‌లో కనీసం ఐదు రైళ్లకు ఐదు నుంచి పది నిమిషాలపాటు హాల్టింగ్ కల్పించాలని రైల్వే శాఖను కోరినట్లు ఎంపీ తెలిపారు. ప్రధాన స్టేషన్లలో మాత్రమే రైళ్లను నిలిపివేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చిన్న స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. ద్వారపూడి స్టేషన్‌లో టికెటింగ్ సదుపాయం లేకపోవడం వల్ల ప్రయాణికులు రాజమహేంద్రవరం, అనపర్తి వంటి ఇతర స్టేషన్లకు వెళ్లి టికెట్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల ద్వారపూడి స్టేషన్ ఆదాయంపై కూడా ప్రభావం పడుతోందన్నారు. ద్వారపూడి నుంచే టికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రి, రైల్వే ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు. గూడ్స్ రవాణా ద్వారా ఈ స్టేషన్‌కు గణనీయమైన ఆదాయం వస్తున్న నేపథ్యంలో ప్రయాణికుల టికెటింగ్ సదుపాయాన్ని కూడా పునరుద్ధరిస్తే స్టేషన్ అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని చెప్పారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ అభివృద్ధి, రైళ్ల హాల్టింగ్, టికెటింగ్ సదుపాయం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించి రైల్వే శాఖ ఫిజిబిలిటీ రిపోర్టును సిద్ధం చేస్తోందని, 2024 జూలై 21న తాము సమర్పించిన ప్రతిపాదనలపై నివేదిక వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారని ఎంపీ వివరించారు. వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం లిఫ్ట్ లేదా ఎస్కలేటర్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా అవసరాన్ని బట్టి పరిశీలిస్తామని, ప్రయాణికుల సౌకర్యానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూడా గతంలో ద్వారపూడి రైల్వే స్టేషన్‌ను పరిశీలించి అక్కడి సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ద్వారపూడి రైల్వే స్టేషన్ అభివృద్ధిని కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అవసరమైన అభివృద్ధి పనులను ఈ ఏడాదిలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ గంటి హరీశ్ మాధుర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి కొప్పిశెట్టి మాధవరావు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, అమలాపురం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండపేట పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగబాబు, కొవ్వాడ అప్పన్నబాబు, గడి రాంబాబు, పిల్లా తాతాలు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి డాక్టర్ రాము బాసట

## విద్యాదానం తరాల తలరాతలను మారుస్తుంది : ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట సాయి ఆర్థో ట్రామా కేర్ అధినేత డాక్టర్ రాము పేద విద్యార్థినికి బాసటగా నిలిచారు. ఆ విద్యార్థి వైద్య విద్య పూర్తయ్యే వరకు పూర్తి ఆర్థిక సహాయాన్ని సంపూర్ణంగా అందిస్తానని డాక్టర్ రాము హామీ ఇచ్చారు. ఒకప్పుడు తాను ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను గుర్తు చేసుకున్న ఓ వైద్యుడు. ఇప్పుడు అదే పరిస్థితుల్లో ఉన్న ఓ నిరుపేద విద్యార్థినికి అండగా నిలిచి ఆమె వైద్య విద్యకు బాసటగా నిలుస్తున్నారు. బిక్కవోలుకు చెందిన నిరుపేద విద్యార్థిని బుడితి జెన్నిఫర్ డాక్టర్ కావాలనే లక్ష్యానికి చేరువవుతున్న వేళ మండపేటకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రాము ఆమెకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ రాము అందించిన ఫీజు, హాస్టల్ ఖర్చు తదితర ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు విద్యార్థినికి అందజేశారు. జెన్నిఫర్‌కు డాక్టర్ రాము అందించిన సహకారంతో ఆమె నీట్ పరీక్షలో 471 మార్కులు సాధించి మెరిట్‌లో నిలిచింది. దీంతో అమలాపురం కిమ్స్‌లో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించింది. జెన్నిఫర్ డాక్టర్ అయ్యే వరకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సంపూర్ణంగా అందిస్తానని డాక్టర్ రాము హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ విద్య ఓ తరాన్ని ఉన్నత స్థితిలో నిలబెడుతుందని, విద్య ద్వారానే ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని, ఒక విద్యార్థికి అందించే విద్యా సహాయం అతడి జీవితాన్నే కాకుండా భవిష్యత్ తరాల తలరాతలను సైతం మార్చగలదని పేర్కొన్నారు. జెన్నిఫర్ విద్యకు అండగా నిలుస్తున్న డాక్టర్ రాము సేవా స్ఫూర్తిని ఎమ్మెల్యే వేగుళ్ళ అభినందించారు. అనంతరం డాక్టర్ రాము మాట్లాడుతూ తాను కూడా పేద కుటుంబం నుంచి వచ్చి ఎంబీబీఎస్ చదివే సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఆ సమయంలో ఓ ఉపాధ్యాయుడు తనకు అండగా నిలిచి రూ.70 వేల లోన్ కోసం బ్యాంకులో ష్యూరిటీ ఇచ్చారని, ఆ సహాయం తన జీవితంలో ఎంతో విలువైనదని గుర్తు చేసుకున్నారు. తాను ఎదుర్కొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని డాక్టర్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగే కొంతమంది నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలని అప్పుడే నిర్ణయించుకున్నానని చెప్పారు. అందులో భాగంగానే జెన్నిఫర్‌కు సహాయం చేస్తున్నానని, ఆమె త్వరలో వైద్యురాలిగా మారబోతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఓ నిరుపేద విద్యార్థి కలను సాకారం చేయడంలో తన వంతు సహాయం అందించడం విలువ కట్టలేని మానసిక ఆనందాన్ని అందిస్తుందని డాక్టర్ రాము పేర్కొన్నారు.

# గోకవరంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**గోకవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోకవరం పాత బస్టాండ్ సమీపంలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమారు 35 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయానికి గోకవరం పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 35 సంవత్సరాలుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆనవాయితీగా ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీకృష్ణ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగగా, భక్తులతో ఆలయం సందడిగా కనిపించింది.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా రహీమ బేగం, మింగి, సుబ్బారావు, కొత్తపల్లి



**కోరుకొండ, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఉపాధ్యాయులు ఎంపిక కావడం ఆనందదాయకమని మండల విద్యాశాఖఅధికారి టి కుశలోవ దొర అన్నారు. శుక్రవారం కుశలోవ దొర ఒక ప్రకటనలో కోరుకొండ మండలంలో విద్యాశాఖలో విశిష్టసేవలు అందించిన ఉపాధ్యాయులు ఎస్ సుబ్బారావు, మింగి శ్రీనివాస్, షేక్ రహిమ బేగం,కొత్తపల్లి శ్రీనివాస్ లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల యుటిఎఫ్ సంఘ నాయకులు, పిఆర్టియు సంఘ నాయకులు, ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. అదే విధంగా ఉత్తమ ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారులకు, మండల విద్యాశాఖఅధికారి, తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు

## కోలాట నృత్యాలతో అలరించిన మహిళలు, యువతులు



**రాయవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. స్థానిక శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గ్రామానికి చెందిన శ్రీ వాసుదేవ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థాన సంఘం సభ్యుల సహకారంతో జరిగిన ఈ వేడుకలకు గ్రామస్థులు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా, వేడుకల్లో భాగంగా తొలుత శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, యాదవ సంఘ నాయకులు, భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీన్మార్ డప్పుల వాయిద్యాలతో వేడుకలు సందడిగా మారాయి. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తుల్లో కోలాట నృత్యాలు చేస్తూ పుర ప్రదక్షిణ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో అన్ని ప్రాంతాల ప్రజలు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. యువకులు శ్రీకృష్ణుని వేషధారణలో పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీపడుతూ సందడి చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తి, సంప్రదాయం, సంస్కృతి, వినోదం కలగలిపిన కృష్ణాష్టమి వేడుకలు రాయవరంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ కార్యక్రమంలో యాదవ కుల పెద్దలు, గ్రామ పెద్దలు, సంఘ నాయకులు, మహిళలు, యువతీ యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### గణేష్ మండపాలకు


# ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి

## రాయవరం ఎస్సై సురేష్ బాబు



**రాయవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా రాయవరం మండల పరిధిలో గణేష్ విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా Ganeshutsav.net వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాయవరం ఎస్సై సురేష్ బాబు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితమని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. దరఖాస్తు నమోదులో సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత గ్రామ మహిళా పోలీసు లేదా రాయవరం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చన్నారు. దరఖాస్తు అనంతరం మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేస్తారని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత ఎన్‌ఓసి జారీ చేస్తారన్నారు. అనంతరం జనరేట్ అయ్యే క్యూ ఆర్ కోడ్‌ను మండపం వద్ద ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాల్సి ఉంటుందని తెలిపారు. మండపాల ఏర్పాటుతో రహదారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, అత్యవసర వాహనాలకు మార్గం ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు సురక్షిత దూరం పాటించడంతో పాటు విద్యుత్ అలంకరణల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. నిర్దేశిత నిబంధనలు, సంబంధిత శాఖల సూచనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని రాయవరం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


# మండపేట మండలానికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**మండపేట టౌన్, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** 2026 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు మండపేట మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు ఎంఈఓ నాయుడు రామచంద్రరావు తెలిపారు.జిల్లా విద్యాశాఖ ప్రకటించిన జాబితాలో గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దంటు శ్రీనివాస్, అర్తమూరు ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) ఎస్ శ్రీనివాస్ రావు, అర్తమూరు మండల ఆదర్శ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు టి. వీర వెంకట గంగా లక్ష్మీ అండాలమ్మ ఎంపికయ్యారు. వీరికి రేపు జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయనున్నారు. ఎంపికైన ఉపాధ్యాయులను ఎంఈఓ లు నాయుడు రామచంద్రరావు ,సోమిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

# చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి

## విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**రాయవరం, సెప్టెంబర్ 4, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని రాయవరంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలతో ఆకట్టుకోగా, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ డా. ఎం. శేష వేణి మాట్లాడుతూ, పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు నైతిక విలువలను పెంపొందించాలని అన్నారు. శ్రీకృష్ణుని జీవితంలోని మంచి సందేశాలను పిల్లలు ఆచరించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వి.నవీన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# అవికా గోర్ ఆ సీన్ చేయనంటే చేయనంది

## దాంతో కథనే మార్చేశాం



నిర్మాత బెక్కం వేణుగోపాల్ తన సినీ ప్రయాణం గురించి పంచుకున్నారు. మేము వయసుకు వచ్చాం చిత్రం చూసి నాని, శర్వానంద్ వంటి స్టార్లు ఎలా స్పందించారో తెలిపారు. సినిమా చూపిస్తా మామ నిర్మాణంలోని సవాళ్లు, అవికా గోర్ తో అనుభవాలు పంచుకున్నారు. ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్ తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎదురైన అనేక అనుభవాలను, ముఖ్యంగా కొన్ని సినిమాల నిర్మాణం వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మేము వయసుకు వచ్చాం చిత్ర ప్రివ్యూ ప్రసాద్ ల్యాబ్‌లో ప్రదర్శించినప్పుడు నాని, శర్వానంద్ వంటి అగ్ర హీరోలు సినిమాను చూసి ఎంతగానో ఆకట్టుకున్నారని తెలిపారు. "ఇలాంటి సినిమా మాకు వస్తుందా?" అని వారు అడిగారని, అది సినిమా విజయాన్ని ముందే సూచించిందని బెక్కం వేణుగోపాల్ గుర్తు చేసుకున్నారు. తనీష్ స్నేహితులుగా వీరంతా మేము వయసుకు వచ్చాం చిత్రానికి అపూర్వ మద్దతు అందించారని, నాని స్వయంగా వాయిస్ ఓవర్ ఇచ్చారని పేర్కొన్నారు. నేను లోకల్, సినిమా చూపిస్తా మామ వంటి చిత్రాల కోసం నటీనటుల ఎంపిక గురించి కూడా ఆయన వివరించారు. నేను లోకల్ కోసం మొదట సందీప్ కిషన్‌ను అనుకున్నారని, ఆ తర్వాత దిల్ రాజుతో చర్చించి నానికి కథ చెప్పగా, ఆయన 20 నిమిషాల కథ వినగానే నచ్చిందని, దానిని డెవలప్ చేశామని తెలిపారు. సాయి ధరమ్ తేజ్‌తో సినిమా తీయడానికి అనేక ప్రయత్నాలు చేసినా అవి కార్యరూపం దాల్చలేదని చెప్పారు. సినిమా చూపిస్తా మామ చిత్రం నిర్మాణ సమయంలో ఎదురైన ఒక ముఖ్యమైన సవాలును కూడా బెక్కం వేణుగోపాల్ పంచుకున్నారు. ఈ సినిమాలో అవికా గోర్ నటించిన కథలో ఇంటర్వెల్ వద్ద హీరోయిన్ గర్భవతి అవుతుందని, దానిపై కథ నడుస్తుందని వివరించారు. అయితే, అవికా గోర్ ఈ పోర్షన్‌ను చేయడానికి నిరాకరించారని, మార్పులు చేస్తేనే చేస్తానని చెప్పారని తెలిపారు. ఈ దశలో బెల్లంకొండ సురేష్ వంటి వారు కూడా రెండు వేర్వేరు ప్రాజెక్ట్‌లను (ఉయ్యాల, జంపాల) ఒకే కథగా మార్చమని సూచించారని, పంపిణీదారులు కూడా కథ మార్చడం సరైనదని అభిప్రాయపడ్డారని అన్నారు. వారి సూచనల మేరకు కథలో మార్పులు చేసి, అవికా గోర్‌కు కొత్త వెర్షన్ నచ్చడంతో సినిమా పూర్తైందని వివరించారు. డిస్ట్రిబ్యూటర్స్ తాను ఎంత ప్రాధాన్యత ఇస్తారో బెక్కం వేణుగోపాల్ స్పష్టం చేశారు. "ఇప్పుడు అయినా ఎప్పుడైనా డిస్ట్రిబ్యూటర్లే కదండీ ఫస్ట్ నా బాధను పంచుకునేది? నేను సినిమా తీసిన తర్వాత నాకు డబ్బులు ఇచ్చేది ఎవరు? డిస్ట్రిబ్యూటర్లు" అని ఆయన పేర్కొన్నారు. తమ సినిమాలను పంపిణీదారులకు ఎప్పుడూ చూపించి, వారి అభిప్రాయాలు తెలుసుకుని, నచ్చితేనే అమ్ముతానని, అది తమ సంప్రదాయమని ఆయన నొక్కి చెప్పారు. పంపిణీదారులు తమకు శాశ్వత భాగస్వాములని, వారి అనుభవం, మార్కెట్ జ్ఞానం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు.

# అదరగొట్టిన ఆనంద్ దేవరకొండ

## ఆకట్టుకుంటున్న ఎపిక్ ట్రైలర్



క్రేజీ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ 'దొరసాని' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఆనంద్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు ఆనంద్. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ సోదరుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు ఆనంద్ దేవరకొండ. అయితే దొరసాని, మిడిల్ క్లాస్ మెలోడీస్, పుష్పక విమానం, హైవే, బేబీ.. ఇలా డిఫరెంట్ సినిమాలతో తనకంటూ ఓ ఐడెంటిటీని సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా సినిమా కథల ఎంపికలో ఆనంద్ దేవరకొండ చాలా డిఫరెంట్‌గా ఆలోచిస్తున్నాడు. బేబీతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకున్నాడు ఆనంద్ దేవర కొండ ఇప్పుడు ఎపిక్ సినిమాతో ప్రేక్షకుల ,ముందుకు రానున్నాడు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాణంలో ఆదిత్య హాసన్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. ఇప్పటివరకు విడుదలైన టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. హీరోయిన్ రష్మిక మందన్న ఈ ఈవెంట్ కి గెస్ట్ గా హాజరయి ట్రైలర్ ని విడుదల చేసారు. ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ట్రైలర్ పై మీరూ ఓ లుక్కేయండి.

# భారత్, జపాన్ క్రికెట్ చరిత్రలోనే అపూర్వ ఘట్టం..

## ఆ రోజే టీమిండియా టీ20 మ్యాచ్



భారత్, జపాన్ క్రికెట్ చరిత్రలో తొలిసారి పురుషుల టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. సెప్టెంబర్ 22న జపాన్‌లోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ పోరు నిర్వహించనున్నారు. ఇరు దేశాల దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవంలో భాగంగా 'సుజుకి కప్', 'స్పోర్ట్ 75' కార్యక్రమాలకు ఈ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. తూర్పు ఆసియాలో క్రికెట్ విస్తరణకు ఇది కీలక ముందడుగు కానుంది. బీసీసీఐ క్రీడాభిమానులకు ఒక ఊహించని సంచలన వార్త అందించింది. భారత్, జపాన్ పురుషుల జట్ల మధ్య సెప్టెంబర్ 22న ఒక చారిత్రాత్మక టి20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. ఇరు దేశాల దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ చారిత్రాత్మక మ్యాచ్?ను నిర్వహిస్తున్నారు. భారత క్రికెట్ చరిత్రలోనే ఇది ఒక నూతన అధ్యాయానికి నాంది కానుంది. జపాన్, భారత్ పురుషుల క్రికెట్ జట్లు అంతర్జాతీయ స్థాయిలో ఒక మ్యాచ్‌లో తలపడటం ఇదే తొలిసారి. ప్రపంచంలోనే అత్యంత పవర్ఫుల్ క్రికెట్ శక్తిగా వెలుగొందుతున్న టీమిండియా, ఇప్పుడిప్పుడే క్రికెట్ రంగంలో అడుగులు వేస్తున్న జపాన్ మధ్య జరిగే ఈ మ్యాచ్ సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరగనుంది. తోచిగి ప్రావిన్స్‌లో ఉన్న ఈ స్టేడియంలో సెప్టెంబర్ 22న ఈ మ్యాచ్ నిర్వహించనున్నట్లు బిసిసిఐ అధికారికంగా వెల్లడించింది.

**ఇరు దేశాల ప్రధానుల చొరవతో స్పోర్ట్ 75**

భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య బంధం మొదలై 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. జపాన్ ప్రధాని సనా యె తకైచి, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల ఫలంగా రూపుదిద్దుకున్న స్పోర్ట్ 75 కార్యక్రమానికి ఇది తొలి పునాది. క్రీడల ద్వారా ఇరు దేశాల ప్రజల మధ్య సత్సంబంధాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యం. 2036లో ఒలింపిక్స్, పారాలింపిక్స్ క్రీడలను నిర్వహించాలనే భారత్ ఆశయానికి జపాన్ సహకారం ఎంతగానో తోడ్పడనుంది.

**తూర్పు ఆసియాలో క్రికెట్ విస్తరణకు బీసీసీఐ అడుగులు**

ఈ చారిత్రాత్మక సంఘటనపై బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. జపాన్ వేదికగా రెండు దేశాల పురుషుల జట్లు టీ20 మ్యాచ్ ఆడటం క్రికెట్ ప్రపంచంలోనే అతిపెద్ద మలుపు అని ఆయన కొనియాడారు. భారత జట్టు సరికొత్త వేదికపై అడుగుపెట్టడం వల్ల తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్ ఆదరణ ఊపందుకుంటుందని, బీసీసీఐ ఈ అద్భుతమైన చొరవలో భాగస్వామి కావడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.

**ఒలింపిక్ కల వైపు అడుగులు**

2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ పట్టుదలతో కృషి చేస్తోంది. జపాన్ వంటి క్రీడా రంగానికి పెద్దపీట వేసే దేశంతో పొత్తు పెట్టుకోవడం వల్ల మౌలిక సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాల మార్పిడి వేగవంతమవుతాయి. క్రికెట్ మ్యాచ్ ద్వారా మొదలవుతున్న ఈ భాగస్వామ్యం రాబోయే రోజుల్లో ఇతర క్రీడలకు విస్తరించి ఇరు దేశాల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేయనుంది.

# విరాట్, సచిన్‌లకు కూడా సాధ్యం కాని రికార్డు

## రోహిత్ శర్మ రేర్ క్లబ్‌లో చేరిన స్మృతి మంధాన



మూడు ఫార్మాట్లలో కనీసం రెండు సెంచరీలు బాదిన రోహిత్ శర్మ అరుదైన క్లబ్‌లో స్మృతి మంధాన చేరింది. స్మృతి మంధాన సాధించిన ఈ అరుదైన రికార్డు భారత మహిళల క్రికెట్ స్థాయిని ప్రపంచ వేదికపై మరింత ఎత్తుకు తీసుకెళ్లింది. మహిళల ఆసియా కప్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన హాంకాంగ్‌పై విధ్వంసకర సెంచరీతో కొత్త చరిత్ర సృష్టించింది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలకు కూడా సాధ్యంకాని ఓ అరుదైన క్లబ్‌లో స్థానం సంపాదించింది. కెప్టెన్ రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ తర్వాత ఆ ఘనత సాధించిన మూడో భారత క్రికెటర్‌గా నిలిచింది.

**సచిన్, విరాట్ లేని ఆ స్పెషల్ క్లబ్ ఏంటి?**

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు అనగానే ప్రతి ఒక్కరికీ సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ పేర్లే గుర్తుకువస్తాయి. క్రికెట్ చరిత్రలో అత్యధిక సెంచరీలు బాదిన టాప్-2 ఆటగాళ్ళు వీరే కావడం విశేషం. మూడు ఫార్మాట్లలోనూ (టెస్టులు, వన్డేలు, టీ20లు) కనీసం ఒకటికి మించి సెంచరీలు సాధించిన భారత ఆటగాళ్ల జాబితా పరిశీలిస్తే అందులో సచిన్, కోహ్లీల పేర్లు కనిపించవు. వన్డేల్లో 54, టెస్టుల్లో 30 సెంచరీలు బాదిన విరాట్ కోహ్లీ ఖాతాలో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఒకే ఒక్క సెంచరీ ఉంది. సచిన్ టెండూల్కర్ తన కెరీర్‌లో ఒకే ఒక్క అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడి 10 పరుగులు మాత్రమే చేశాడు.

**రోహిత్ శర్మ సరసన స్మృతి**

మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై అద్భుత సెంచరీ నమోదు చేయడం ద్వారా స్మృతి మంధాన ఈ ప్రత్యేకమైన రికార్డు క్లబ్‌లో అడుగుపెట్టింది. టెస్టులు, వన్డేలు, టీ20లు అనే మూడు ఫార్మాట్లలోనూ కనీసం రెండు లేదా అంతకంటే ఎక్కువ సెంచరీలు చేసిన మూడో భారతీయ క్రికెటర్‌గా మంధాన నిలిచింది. ఈ లిస్టులో టీమిండియా హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ మాత్రమే ముందున్నారు.

**మూడు ఫార్మాట్లలో నంబర్ వన్ స్టాట్స్**

ఈ అరుదైన ఘనత సాధించిన ముగ్గురు భారత ఆటగాళ్ల గణాంకాలు ఎంతో ఆకట్టుకుంటాయి. రోహిత్ శర్మ టెస్టుల్లో 12, వన్డేల్లో 34, టీ20ల్లో 5 సెంచరీలు బాది అగ్రస్థానంలో ఉన్నాడు. కేఎల్ రాహుల్ టెస్టుల్లో 12, వన్డేల్లో 8, టీ20ల్లో 2 సెంచరీలు సాధించాడు. స్మృతి మంధాన టెస్టుల్లో 2, వన్డేల్లో 14, టి20ల్లో 2 సెంచరీలు పూర్తి చేసుకుని మహిళల క్రికెట్ లో ఏకైక భారత ప్రతినిధిగా నిలిచింది.

**హాంకాంగ్‌పై స్మృతి విధ్వంసం**

హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్మృతి 124 పరుగులు చేసి అదరగొట్టింది. తన ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు బాది ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది. ఈ మ్యాచ్‌లో భారత్ 193 పరుగుల భారీ స్కోరు సాధించగా, హాంకాంగ్‌ను 56 పరుగులకే ఆలౌట్ చేసి 137 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ ఆసియా కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. సెప్టెంబర్ 5న పాకిస్థాన్‌తో తదుపరి పోరు జరగనుంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com